ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 14.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

2. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లో 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్ విజయవంతంగా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించిందని టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్ వెల్లడించారు.

3. రైతులు పండించిన ధాన్యం చివరి గింజ కూడా కొనుగోలు చేస్తామని మంత్రులు అన్నారు.

4. త్వరలో పలు శాఖల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడనున్నాయని, యువత అందుకు సిద్ధంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

5. చక్కెర ఎగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

**రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్న హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్లను ఏర్పాటు చేయాలని, రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారుల నిర్మాణం ఉండాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థలు, సోలార్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రవాణా వ్యయం తగ్గించడానికి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచాలని, ట్రాఫిక్ నియంత్రణకు కృత్రిమ మేధను వాడుకోవాలని అధికారులను కోరారు. పర్యాటక రంగాన్ని బలోపేతం చేస్తూ నల్గొండ-యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్ ప్రాంతంలో టూరిజం కారిడార్ అభివృద్ధి చేయాలని ఆదేశించారు. సింగరేణి నిధులను స్థానిక పురపాలికల అభివృద్ధికి వెచ్చించాలని, వచ్చే 25 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని రేవంత్ రెడ్డి  దిశానిర్దేశం చేశారు.

డెస్క్

**జూపల్లి**

ప్రతి ఇల్లు ఒక గ్రంథాలయంగా మారాలని ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో విద్యా వారోత్సవాల్లో భాగంగా ఈరోజు వనపర్తి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ భవనంపై అదనపు భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జూపల్లి మాట్లాడుతూ...

**బైట్ - జూపల్లి కృష్ణా రావు**

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయం చైర్మెన్ రియాజ్, గ్రంధాలయం చైర్మెన్ గోవర్ధన్ సాగర్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, తదితరులు పాల్గొన్నారు.

పిటిసి, వనపర్తి

**వి. హనుమంతరావు**

బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వి.హనుమంతరావు సచివాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. బలహీన వర్గాల అభ్యున్నతికి హనుమంతరావు నియామకం ఎంతో దోహదపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీసీల సంక్షేమం కోసం ఆయన ఇచ్చే విలువైన సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని, అందరం కలిసి వెనుకబడిన వర్గాల హక్కుల కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు.

డెస్క్

**టీజీ జెన్‌కో**

నల్గొండ జిల్లా, వీర్లపాలెంలో టీజీ జెన్‌కో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. 800 మెగావాట్ల సామర్థ్యం గల 5 యూనిట్ల ఈ ప్రాజెక్టులో మూడవ యూనిట్ నిన్న రాత్రి 8 గంటలకు విజయవంతంగా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. వరుసగా 72 గంటల పాటు సగటున 811.99 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ఈ ఘనత సాధించింది. ఈ కార్యక్రమంలో టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్, విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిరంతర పర్యవేక్షణ, అధికారుల సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని సీఎండీ పేర్కొంటూ, టీజీ జెన్‌కో, భెల్ బృందాలను అభినందించారు. ఇప్పటికే మూడు యూనిట్లు అందుబాటులోకి రాగా, తాజా యూనిట్ ప్రారంభంతో రాష్ట్ర విద్యుత్ అవసరాలకు మరింత ఊతం లభించనుందని వెల్లడించారు.

పిటిసి, నల్గొండ

**మంత్రులు**

రైతు సంక్షేమంలో రాజీ పడే ప్రసక్తే లేదని, రైతులు పండించిన ధాన్యం చివరి గింజ కూడా కొనుగోలు చేస్తామని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోలు పర్యవేక్షించేందుకు జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్

కుమార్ తో కలిసి మంత్రులు నల్లగొండ జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, మిల్లింగ్ తో పాటు రైతులకు చెల్లింపులపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రైతులతో స్వయంగా మాట్లాడి కొనుగోలు కేంద్రాల లో సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే వాటి పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల సందర్శన అనంతరం జిల్లా కలెక్టరేట్లో జరిగే రివ్యూ సమావేశంలో మంత్రులు పాల్గొంటారు.

పిటిసి, నల్గొండ

**వివేక్ వెంకటస్వామి**

సింగరేణిలో కొత్త గనులు, కొత్త ఉద్యోగాలు తీసుకొచ్చి సింగరేణికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేస్తుందనీ కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈరోజు మంచిర్యాల జిల్లా మందమర్రి లోని KK-5 గని లో కార్మికులతో కలిసి గని లోపలికి దిగి కార్మికులు పని చేసే పని ప్రదేశాలను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ...

బైట్ ... మంత్రి వివేక్ వెంకటస్వామి

సింగరేణి సంస్థ కార్మికులకు రక్షణ కల్పిస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు అనంతరం శ్రమ శక్తి అవార్డు గ్రహీతలను అభినందించారు.

పిటిసి, మంచిర్యాల

**సీపీగెట్ నోటిఫికేషన్**

తెలంగాణలోని ఏడు విశ్వవిద్యాలయాలతో పాటు మరికొన్ని వర్సిటీల్లో పీజీ సీట్ల భర్తీకి నిర్వహించే సీపీగెట్ నోటిఫికేషన్ విడుదలైంది. రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు జూన్ 10 వరకు సాధారణ రుసుముతో, జూన్ 18 వరకు జరిమానాతో దరఖాస్తు చేసుకోవచ్చు. జులై మొదటి వారంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించి, ఆగస్టు

మొదటి వారం నుండి తరగతులు ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... తొలిసారి సీపీగెట్‌ను తమ వర్సిటీ నిర్వహిస్తోందన్నారు. ఈసారి ఇంటర్ విద్యార్హతతో ప్రవేశాలు పొందే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీ సీపీగెట్ ద్వారా ఉండదని, వాటిని దోస్త్ లో చేర్చినట్లు తెలిపారు.

డెస్క్

**ఇంటర్**

ఈరోజు తెలంగాణ ఇంటర్ రెండవ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-2 పరీక్షకు సెట్-బి ప్రశ్నపత్రాన్ని బోర్డు ఖరారు చేసిందని టీజీబీఐఈ కార్యదర్శి తెలిపారు. పరీక్ష సాఫీగా జరిగేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

డెస్క్

**పొంగులేటి**

త్వరలో పలు శాఖల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడనున్నాయని, యువత అందుకు సిద్ధంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా, ఏదులాపురం మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇప్పటికే 75 వేల ఉద్యోగాలకు పైగా నిరుద్యోగ యువతకు ఇచ్చామన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు పని చేయాలని మంత్రి ఆదేశించారు.

**BYTE … PONGULETI**

ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర్ టీఎస్, ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

పిటిసి, ఖమ్మం

**చక్కెర ఎగుమతులపై నిషేధం**

చక్కెర ఎగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయంగా చక్కెర నిల్వలను పెంచడంతో పాటు సామాన్యులపై ధరల భారం పడకుండా ఈ చర్యలు చేపట్టింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి రానుండగా సెప్టెంబర్ 30 వరకు ఆంక్షలు కొనసాగుతాయి. ముడి, తెల్ల, శుద్ధి చేసిన చక్కెర ఎగుమతులకు ఈ నిబంధన వర్తిస్తుందని, అయితే కోటా ఒప్పందాల ప్రకారం ఈయూ, అమెరికా దేశాలకు చేసే ఎగుమతులకు మాత్రం మినహాయింపు ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది.

ఎన్.ఎస్.డి

**పి ఎం జె జూవెలర్స్**

కరీంనగర్ పీఎంజే జూవెలర్స్ దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. ఈరోజు విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ఈ దోపిడిని సుబోధ్ సింగ్ అనే వ్యక్తి జైలు నుంచే ఆపరేట్ చేశాడని తెలిపారు. 82 లక్షల రూపాయల విలువైన సొత్తును ఈ గ్యాంగ్ దోచుకెళ్లిందని అన్నారు. దొంగలు మొబైల్ నెట్‌వర్క్ వాడకుండా ప్రత్యేక యాప్స్, ఆఫ్‌లైన్ మ్యాప్స్ సాయంతో పోలీసులకు దొరక్కుండా తప్పించుకున్నారని విచారణలో తేలిందని వెల్లడించారు. వీరు నకిలీ ఆధార్ కార్డులతో ధర్మపురిలోని లాడ్జిలో బస చేసి, పకడ్బందీగా రెక్కీ నిర్వహించి ఈ నేరానికి పాల్పడ్డారు. ఇంకా 13 మంది నిందితులు పరారీలో ఉన్నారని సీపీ వివరించారు.

పిటిసి, కరీంనగర్